ముగిసిన సంక్రాంతి వేడుకలు

- ఆకేపాటి ఎస్టేట్‌లో ఆటల పోటీలు
- గోపూజ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల
- రైల్వేకోడూరులో యథేచ్ఛగా కోడి పందేలు


రాజంపేట రూరల్ : అలంకరణలో అయ్యప్ప స్వామి


రాజంపేట రూరల్ : తాడులాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి సోదరులు


నందలూరు: చెయ్యేరు సంబరాలలో పాల్గొన్న ప్రజలు

రాజంపేట రూరల్ : సంక్రాంతి వేడుకలలో భాగంగా దివంగత ఆకేపాటి లక్ష్మిరెడ్డి, అనసూయమ్మల జ్ఞాపకార్థం ఆకేపాటి ఎస్టేట్‌లో ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో పెద్దల పండుగ సందర్భంగా మంగళవారం నిర్వహించిన మహిళల తాడులాగుడు, మ్యూజికల్ చైర్స్ పోటీలు ఆకట్టుకున్నాయి. పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఆకేపాటి సోదరులు బహుమతులు అందజేశారు. పండుగను పురస్కరించుకొని వందలాదిగా తరలివచ్చిన ప్రజలకు ఎమ్మెల్యే ఆకేపాటి, ఆయన సోదరుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డిలు దుస్తులు పంపిణీ చేశారు. కనుమ పండగ సందర్భంగా బుధవారం ఎస్టేట్‌లో ఉన్న గోవులను సుందరంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం చిట్లా కుప్ప(మంట) వేసి గోవులను తిప్పి పంపి పండుగ చేసుకున్నారు. మండల పరిధిలోని గుండ్లూరులో సర్పంచ్ ఏబీ మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఏబీ సుదర్శన్‌రెడ్డి, జి.మల్లికార్జునరెడ్డి, జి.కల్యాణ్‌కుమార్‌రెడ్డితోపాటు గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్ప దేవస్థానంలో..

హరిహర సుతుడు శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానంలో మంగళవారం జ్యోతి దర్శనంను పురస్కరించుకొని మంగళవారం మకర సంక్రాంతి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్పస్వామికి యంత్ర పూజ, అభిషేకాలు జరిపారు. అనంతరం అయ్యప్పను గంధంతో అలంకరించారు. జ్యోతి దర్శన సమయంలో దేవాలయంలో కర్పూరం వెలిగించి స్వామియే శరణం అయ్యప్ప అని భక్తి భావంతో శరణు ఘోష చేశారు. కాగా మండలంలోని మెహర్‌బాబా నగర్‌లో పండుగ సందర్భంగా భోగి మంటలు వెలిగించడంతోపాటు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రైల్వేకోడూరులో పండుగ సంబరాలు

రైల్వేకోడూరు అర్బన్ : సంక్రాంతి పండుగను మండలంలోని పలు గ్రామాలలో ప్రజలు, రైతులు, యువతీయువకులు మంగళ, బుధవారాలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కుటుంబంతో కలిసి గోపూజ కార్యక్రమాన్ని చేశారు. ప్రతి గ్రామంలో యథేచ్ఛగా కోడి పందేలు నిర్వహించారు. పొంగుబాలు సమర్పణ, గొబ్బెమ్మలు, పశువుల అందాలతో పల్లెటూరికి పండుగ కళ వచ్చింది. అన్నదమ్ములు, ఆడబిడ్డలు, బంధుమిత్రులు అంతా ఒకచోట చేరి సరదాగా గడిపారు. ముగ్గుల పోటీలు, గాలిపటాలు ఇలా ఎంతో సరదాగా గడిచిపోయింది. ప్రత్యేక పూజలు, నగర సంకీర్తన నిర్వహించారు. రైతులు ఎడ్లబండిని, ఎద్దులను అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని కొత్తబజార్, పాత బజార్, రంగనాయకులపేట, శ్రీరామ్‌నగర్, కృష్ణానగర్, అంకమ్మనగర్, లక్ష్మీనగర్, అంబేడ్కర్ నగర్ తదితర ప్రాంతాలలో సంక్రాంతి వేడుకగా నిర్వహించారు.

ముగిసిన ధనుర్మాస పూజలు

పెనగలూరు : మండలంలో సంక్రాంతి పండుగ రోజున ధనుర్మాస పూజలు వైభవంగా ముగిశాయి. నెలరోజులపాటు పెనగలూరులోని వేణుగోపాల స్వామి ఆలయంలో, కొత్తపల్లి వద్ద ఉన్న వెంగతాత స్వామి ఆలయాలలో ధనుర్మాస పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతిరోజు తెల్లవారుజామున ధనుర్మాస పూజలు ముగియడంతో వెంగతాత స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి కొత్తపల్లి పురవీధులలో ఊరేగించారు. మేళతాళాలు, టపాసులు కాల్చుతూ ఊరేగింపు కార్యక్రమాన్ని జరిపారు.

చెయ్యేరులో..

నందలూరు : మండలంలోని చెయ్యేరు (బహుదానది)లో కనుమ పండుగ సందర్భంగా బుధవారం సాయంత్రం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలోని కుమ్మరపల్లి, ఇసుకపల్లి ప్రజల ఆధ్వర్యంలో గుండు మల్లికార్జున రెడ్డి పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆకేపాటి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కాగా రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసేందుకు ఆర్థికంగా సహకారం అందజేశారు. ఇసుకలో ఎడ్ల బండ్ల పోటీలలో మొదటి బహుమతి నాయనపల్లి జనార్దన దివాన్ కాట్, ద్వితీయ బహుమతి చింతకుంట సుధాకర్ రెడ్డి వాషింగ్ మిషన్, తృతీయ బహుమతి దేవిశెట్టి బాలయ్య మిక్సీని గెలుచుకున్నారు. చెయ్యేరు తీరంలో జరిగిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పోటీలు ఆకట్టుకున్నాయి. విజేతలకు ఆకేపాటి బహుమతులు అందజేశారు. ఏఎస్ఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.


రైల్వేకోడూరు అర్బన్: అయ్యవారిపల్లిలో ఒకే ఆకులో భోజనం చేస్తున్న కుటుంబ సభ్యులు


రైల్వేకోడూరు అర్బన్: కొత్తబజార్‌లో రాములవారి గ్రామోత్సవం


నందలూరు: బహుమతిని అందజేస్తున్న ఆకేపాటి


రైల్వేకోడూరు అర్బన్: గోపూజ కార్యక్రమంలో కొరముట్ల


పెనగలూరు : కొత్తపల్లిలో వెంగతాత ఊరేగింపు


రాజంపేట రూరల్ : మెహర్‌బాబా నగర్‌లో భోగి మంటలు


నందలూరు: ఇసుకలో ఎడ్లబండ్ల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

ఘనంగా ఇంటి దేవుళ్ల ఊరేగింపు


ఊరేగింపుగా వెళ్తున్న దేవరింటి దేవతలు

లక్కిరెడ్డిపల్లి : దేవరింటివారి ఇంటిదేవుళ్ల వేంకటేశ్వరస్వామి, గుర్రప్ప స్వామి, ఎల్లమ్మ అమ్మవార్లను ఘనంగా ఊరేగించారు. మంగళవారం కస్తూరురాజుగారిపల్లి పంచాయతీ చాగల గుట్టపల్లిలో దేవరింటి వంశస్తులు వారికి వంశపారంపర్యంగా వస్తున్న దేవరింటి ఇలవేల్పు దేవుళ్లను ప్రతి ఏడాది మకర సంక్రాంతి రోజున దేవరింటి ఆలయం నుంచి అదే ఊరిలో ఉండే పడమర నీళ్ల బావిలో జల్దీ చేస్తారు. అలానే దేవరింటి వంశస్తులందరూ బావిలో స్నానం ఆచరించి దేవ, దేవతలను ఆచారాల ప్రకారం భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా దేవరింటి ఆలయం వద్దకు తీసుకెళ్తారు. ఊరేగింపు ముగిసిన వెంటనే ఆలయం దగ్గర 116 పళ్లెం ప్రసాదాలను సమర్పించి ఒక్కపొద్దులు తీర్చుకుంటారు. ఈ కార్యక్రమంలో దేవరింటి కుల ప్రముఖులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మమత

రాయచోటి : చెన్నముక్కపల్లె సర్పంచ్ మమత, వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీనివాసులు రెడ్డిల ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మంగళవారం సంక్రాంతి పండుగ సందర్భంగా వారి స్వగృహంలో పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వందమంది మహిళలకు చీరలు, మరో వంద మందికి పురుషులకు పంచెలు అందజేశారు. కార్యక్రమంలో చిన్నప రెడ్డి (మాజీ డీలర్), ఉదయ్ కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం


బహుమతిని అందజేస్తున్న నిర్వాహకులు

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లిలో యూత్ బృందం సభ్యులు జగదీశ్వర్ రెడ్డి, దేశ ప్రకాశ్ రెడ్డి, అశోక్ రెడ్డి, హరినాథ్ రెడ్డిల ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు నిర్వహించారు. పోటీల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతితోపాటు పాల్గొన్న వారికి కన్సలేషన్ బహుమతులు అందజేశారు.

ఘనంగా జెండా ఉత్సవం


జెండా ఉత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

రామాపురం : మండలంలోని దర్బారుసాయి నగర్‌లో ఉన్న దర్గాలో శ్రీ సద్గురు ఖాదర్ వలీ బాబా స్వామి జెండా ఉత్సవం బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. దత్తాత్రేయ జయంతి సందర్భంగా దత్తాత్రేయ స్వామికి, సద్గురువులకు విశేష పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జెండా ఉత్సవం, పూజలలో పాల్గొన్నారు.

భజన పాటలు పాడుతూ..

సిద్దవటం : మండలం కేంద్రంలోని దిగువపేట గాంధీ వీధిలోని శ్రీ రామాలయం నుంచి మంగళవారం రాత్రి సీతారాముల చిత్రపటం ఊరేగింపు కార్యక్రమాన్ని స్థానికుల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామంలోని యువకులు సీతారాముల భజన పాటలు పాడుకుంటూ ఊరేగించారు. స్వామి వారి పల్లకి నివాస గృహాల వద్దకు రాగానే మహిళలు స్వామి వారికి కాయాకర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

మంత్రికి సర్పంచ్ శుభాకాంక్షలు

వీరబల్లి : రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి మండలంలోని వంగిమళ్ల సర్పంచ్ సరస్వతమ్మ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన వంగిమళ్ల పంచాయతీ టెంకాయచెట్టుపల్లెలో జరిగిన ఓ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అంతకుముందు సర్పంచ్ సరస్వతమ్మ నివాసం వద్దకు రాగానే మంత్రిని దుశ్శాలువా, పూల దండలతో సన్మానించారు.

సబ్సిడీతో సోలార్ ఫెన్సింగ్ అందించాలి


మలిశెట్టి జతిన్

చిట్వేలి : మండలంలో వ్యవసాయానికి కోతుల బెడద ఎక్కువైనందున రైతులందరికీ ముఖ్యంగా బొప్పాయి రైతులకు 90 శాతం సబ్సిడీతో సోలార్ ఫెన్సింగ్ అందించాలని రైతు నాయకులు మలిశెట్టి జతిన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం వెంకటరాజుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బొప్పాయి సాగు చేయాలంటే కచ్చితంగా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలని ఆయన కోరారు.

పాడి రైతుల సంక్షేమానికి పెద్దపీట

రామాపురం : పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గోపగుడిపల్లె గ్రామం అడపాలమాలపల్లెలో మినీ గోకులాన్ని ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమానికి అధిక నిధులు ఖర్చు చేసి పెద్దపీట వేస్తోందని, రాష్ట్ర వ్యాప్తంగా పలు గ్రామాలలో మిని గోకులాలు ఏర్పాటు చేసి పశువుల సంరక్షణకు చర్యలు తీసుకున్నట్టు తెలియజేశారు. మినీ గోకులాల నిర్మాణానికి పశుసంవర్ధక శాఖ, ఉపాధి హామీ పథకం అధికారులు సమన్వయంతో నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని తెలియజేశారు. అనంతరం ఆయన మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి ఆహ్వానం మేరకు ఆయన స్వగృహానికి వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు ఆయన్ను సత్కరించారు.

బదిలీల్లో ప్రాధాన్యత కల్పించండి

ఉపాధ్యాయుల బదిలీలో ఎన్‌సీసీ వారికి అనుసరించే విధానాలను అడ్వాన్సు ట్రైనింగ్ పూర్తి చేసిన స్కాట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు వర్తింపజేయాలని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి బుధవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ అన్నమయ్య జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి రామాపురంలో వినతి పత్రాన్ని అందజేశారు. అడ్వాన్స్ ట్రైనింగ్ పూర్తి చేసిన స్కాట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లను అదే స్కాట్ విభాగంలో పోస్టు ఖాళీగా ఉన్న పాఠశాలలకు మాత్రమే బదిలీ చేయాలని విన్నవించారు. అలా సాధ్యం కానప్పుడు వారిని అదే పాఠశాలలో కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ద్వితీయ సంవత్సరంలో ఉన్న స్కాట్ విద్యార్థులు తృతీయ సోపాన్, రాజ పురస్కార్ సర్టిఫికెట్లు పొందలేని పరిస్థితి ఏర్పడి తీవ్ర నష్టం కలుగుతుందని తెలియజేశారు. గత బదిలీలలో ఎన్‌సీసీ వారితో పాటు సమానంగా స్కాట్ మాస్టర్‌లకు, గైడ్ కెప్టెన్లకు ప్రాధాన్యత కల్పించినట్టు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఏప్రిల్‌లో నిర్వహించే సాధారణ బదిలీల్లో అదే విధానాన్ని అమలు చేయాలని విన్నవించారు.


రామాపురం: మినీ గోకులాలను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

'రాజకీయాల్లో మతం చొరబడటం ప్రమాదకరం'

రాయచోటి టౌన్ : రాజకీయాలలో మతం చొరబడటం ప్రమాదకరమని ఆప్‌కి ఆవాజ్ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జావిద్, సామాజిక కార్యకర్త కె.జీవానందం పేర్కొన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని అన్నారెడ్డి కాంప్లెక్స్‌లో సంస్థ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ దేశంలో హిందూ ముస్లిం అనే తేడాలు లేకుండా సోదరభావంతో కలసిమెలసి జీవిస్తున్నారన్నారు. ఇలాంటి సమయంలో కొందరు రాజకీయ నాయకులు మత రాజకీయాలు చేస్తుండటం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.మహబూబ్ బాషా, ధనుంజయ, ఎండీ రామాంజులు, ఎల్ఐసీ ప్రసాద్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

రెడ్డయ్యరాజుకు సీఎం అభినందన

సుండుపల్లె : విశిష్ట పాఠశాల స్థాపించి సామాన్య, పేద ప్రజలకు న్యాయమైన విద్యను అందిస్తున్న డాక్టర్ రెడ్డయ్య రాజును సీఎం చంద్రబాబు నాయుడు అభినందించారు. నారావారిపల్లిలో సీఎంను ఆయన కలిసి అమరావతి అభివృద్ధికి రూ. 50 వేలు చెక్కను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని రెడ్డయ్యరాజు దుశ్శాలువాతో సత్కరించారు.

కిక్కిరిసిన మాంసపు దుకాణాలు

ఒంటిమిట్ట : కనుమ పండుగను పురస్కరించుకొని మండల ప్రజలు మాంసపు దుకాణాలకు ఎగబడ్డారు. కనుమ పండుగ రోజు మినప వడలతో మాంసాహార పదార్థాలతో తినడం ఆచారం. బుధవారం కనుమ పండుగను పురస్కరించుకొని మండల ప్రజలు అర్ధరాత్రి 12 గంటల నుంచి మాంసాన్ని విక్రయించే దుకాణాల యాజమానులు కోళ్లు, పొట్టేళ్లు, మేకపోతులను కోయడం మొదలుపెట్టారు. మండల ప్రజలు తెల్లవారుజామున మూడు గంటల నుంచి మాంసాహారాన్ని కొనుగోలు చేసేందుకు దుకాణాల వద్దకు ఎగబడ్డారు. దీంతో మండల కేంద్రంలోని మాంసపు దుకాణాలు కిక్కిరిసి కనిపించాయి.


కొనుగోలుదారులతో కిక్కిరిసిన చికెన్ దుకాణం

18 నుంచి జానీబాషా సాహెబ్ ఉరుసు

రాజంపేట టౌన్ : పట్టణంలోని జానీబాషాపురంలో ఈనెల 18వ తేదీ నుంచి రెండు రోజులపాటు శ్రీ జానీబాషా సాహెబ్ ఉరుసు మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ ప్రతినిధులు తెలిపారు. జానీబాషాపురంలో బుధవారం ఉరుసు పోస్టర్లను కమిటీ ప్రతినిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జానీబాషా సాహెబ్ వల్ల తమ గ్రామం ఏర్పడిందని, ఆయన పేరిట నిర్వహించే ఉరుసు ఉత్సవంలో భాగంగా 18వ తేదీ రాత్రి 8 గంటలకు షేక్ మస్తాన్ ఇంటి వద్ద నుంచి గంధం ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. 19వ తేదీ రాత్రి ఉరుసు మహోత్సవం జరుగుతుందన్నారు. ఉరుసు వేడుకలో భాగంగా రాత్రి 9 గంటల నుంచి బెంగుళూరుకు చెందిన ముజమిల్ దరజ్‌చిస్తి, హైదరాబాద్‌కు చెందిన షఫియావర్షిలచే ఖవ్వాలి ఉంటుందని తెలియజేశారు.


పోస్టర్లను విడుదల చేస్తున్న కమిటీ ప్రతినిధులు

తిరుగు ప్రయాణానికీ తప్పని తిప్పలు


రాజంపేట టౌన్: తత్కాల్ టికెట్ కోసం బారులు తీరిన ప్రజలు


రాయచోటి అర్బన్: ప్రయాణికులతో కిక్కిరిసిన రాయచోటి బస్టాండ్

రాజంపేట టౌన్ : సంక్రాంతి సందర్భంగా పరవదించిన కుటుంబ సభ్యులకు దుస్తులు పెట్టుకునేందుకు సొంతూళ్లకు వచ్చిన బంధువులకు తిరిగి తాము నివాసం ఉండే ప్రాంతాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రజలే కాక ఇతర రాష్ట్రాల్లో ఉన్న ప్రజలు సంక్రాంతి పండుగ కోసం తమ స్వగ్రామాలకు పెద్దఎత్తున చేరుకున్నారు. అయితే గురువారం నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, కార్యాలయాలు పనిచేయనున్న కారణంగా అనేక మంది కనుమ పండుగ రోజు నుంచే తిరుగు ప్రయాణం అవుతున్నారు. అయితే ప్రజల రద్దీకి సరిపడా బస్సులు లేకపోవడంతో రైళ్లను ఆశ్రయిస్తున్నారు. రైళ్లల్లోనూ ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంది. దీంతో ప్రయాణికులు తత్కాల్ టికెట్ల కోసం రైల్వేస్టేషన్‌లో బుకింగ్ కౌంటర్ వద్ద బారులు తీరి కనిపించారు. ప్రభుత్వం ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రధాన ప్రాంతాలకు అదనపు సర్వీసులు నడపాలని కోరుతున్నారు.

రసవత్తరంగా క్రీడా పోటీలు



రాజంపేట: విజేతకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం


ఓబులవారిపల్లె: టోర్నీని ప్రారంభిస్తున్న అశోక్‌రెడ్డి

రాజంపేట : ఏయూ క్రీడా మైదానంలో అన్నమాచార్య విశ్వవిద్యాలయ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. పోటీలు ఆద్యంతం రసవత్తరంగా సాగాయి. ఫైనల్‌లో అన్నమాచార్య స్ట్రైకర్స్, అన్నమాచార్య నైట్స్ జట్టు తలపడగా అన్నమాచార్య నైట్స్ విజయం సాధించింది. ఏయూ ప్రో చాన్స్‌లర్ చొప్పా అభిషేక్‌రెడ్డి విజేతలకు ట్రోఫీతోపాటు క్రీడా ప్రశంసా పత్రాలను అందజేశారు. క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం, ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల ద్వారా యువతకు స్ఫూర్తి అందించడమే లక్ష్యంగా ఏయూ ముందుకెళుతుందని అభిషేక్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీ నాగముని, డా.కిషోర్, దినేష్‌వర్మ, సయపుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : సంక్రాంతి పండుగ సందర్భంగా మండలస్థాయి షటిల్ టోర్నమెంట్‌ను మంగళవారం వైఎస్సార్‌సీపీ యువ నాయకులు చిన్నిరెడ్డి అశోక్ రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోటీలలో గెలుపొందిన వారికి తన సొంత నిధులతో మొదటి బహుమతి రూ.7 వేలు, ద్వితీయ బహుమతి రూ. 5 వేలు, తృతీయ బహుమతి రూ. 3 వేలుతోపాటు మెమెంటోను అందజేశారు.

సంప్రదాయబద్ధంగా చిట్లాకుప్ప ఉత్సవం

మూడు రోజులపాటు జరిగిన సంక్రాంతి వేడుకలు చిట్లాకుప్ప ఉత్సవంతో ముగిశాయి. బుధవారం సాయంత్రం రైతులు వ్యవసాయానికి సహకారం అందించే ఎద్దులకు స్నానాలు చేయించి ప్రత్యేకంగా అలంకరించారు. అలానే ఎద్దుల బండ్లను ముస్తాబు చేశారు. అంతకుముందు గ్రామ శివారుల్లో ఏర్పాటు చేసిన చిట్లాకుప్పల వద్దకు ఎద్దులను తీసుకెళ్లి వాటిని బెదిరించి దాని చుట్టూ తిప్పారు. – సాక్షి, నెట్‌వర్క్


రాజంపేట టౌన్: అగ్రహారంలో వేసిన చిట్లాకుప్ప


లక్కిరెడ్డిపల్లె: గడ్డగుండ్ల రాచపల్లెలో ఎద్దులను బెదిరిస్తున్న రైతులు


లక్కిరెడ్డిపల్లె: అనంతపురం గ్రామం గొల్లపల్లెలో..


సుండుపల్లె: మల్లక్కగారిపల్లెలో ఏర్పాటు చేసిన చిట్లాకుప్ప


సుండుపల్లె: చిట్లాకుప్ప వద్ద గుమికూడిన ప్రజలు


చిన్నమండెం: మండల కేంద్రంలో కాటమరాయుడుకు ప్రత్యేక పూజలు


చిన్నమండెం: బలిజపల్లెలోని చిట్లాకుప్ప వద్ద జాతర వాతావరణం


రామాపురం: నల్లగుట్టపల్లె కొత్తపల్లె చిట్లాకుప్ప వద్ద ప్రజలు


రాయచోటి టౌన్: చిట్లాకుప్ప వద్ద పశువులను పరిగెత్తిస్తున్న గ్రామ ప్రజలు


పెనగలూరు: గొబ్బెమ్మను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న దృశ్యం


సంబేపల్లె: పెద్దజంగంపల్లెలో చిట్లాకుప్ప ఉత్సవం


సంబేపల్లె: పెద్దజంగంపల్లెలో ఎద్దులను చిట్లాకుప్ప చుట్టు తిప్పుతున్న రైతులు


ఓబులవారిపల్లె: గోవుల అలంకరణలో..


పుల్లంపేట: టీటీడీ ఆధ్వర్యంలో గోపూజ


సంబేపల్లె: అలంకరణలో ఎద్దులబండి


సంబేపల్లె: అలంకరణలో ఎద్దు